7

సాక్షి
నిజామాబాద్

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



విద్యుత్ దీపాల వెలుగులో గోల్ హనుమాన్ ఆలయం

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్ సిటీ: జిల్లాలో హనుమాన్ జయంతి వేడుకలకు ఆలయాల కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. చైత్ర పౌర్ణమిని హనుమాన్ జయంతిగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. నగరంలోని గోల్‌హనుమాన్, సారంగపూర్, నీరుగొండ హనుమాన్, కంఠేశ్వర్‌లోని రోకడ్ హనుమాన్ తదితర ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ గురు : 6:36 | సహర్ శుక్ర:4:43

న్యూస్‌రీల్

రేపటి నుంచి మాధవనగర్ రోడ్డు బంద్

- 20 రోజుల పాటు మూసివేత

ఖలీల్‌వాడి: నగరంలోని మాధవనగర్ రైల్వే ట్రాక్ వద్ద భారీ పిల్లర్ల నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో రోడ్డును మూసి వేయనున్నారు. శుక్రవారం నుంచి ఎటువంటి వాహనాలు కూడా ఈ రోడ్డు మీదుగా వెళ్లడానికి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి 20 రోజుల పాటు ఈ రోడ్డును మూసివేయనున్నారు. ప్రస్తుతం ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పనుల్లో భాగంగా భారీ పిల్లర్ల నిర్మాణం చేపట్టడంతో ఈ రోడ్డు వెంట వెళ్లే వాహనాలకు అనుమతి ఉండదని పేర్కొన్నారు.

కంఠేశ్వర్ బైపాస్ మీదుగా..

ఆర్వోబీ పనుల ప్రారంభం నుంచి భారీ వాహనాలతో పాటు బస్సులు, లారీలు తదితర వాహనాలు కంఠేశ్వర్ బైపాస్ నుంచి వెళ్తున్నాయి. డిచ్‌పల్లి నుంచి వైపు నగరంలోకి వచ్చే వాహనాలు కూడా కంఠేశ్వర్ నుంచి వస్తున్నాయి. మాధవనగర్ నుంచి కార్లు, ఆటోలు, టూవీలర్స్ వెళ్లేవి. కానీ శుక్రవారం నుంచి వాటిని కూడా అనుమతి ఉండదని సంబంధిత అధికారులు తెలిపారు.

బోర్గాం చౌరస్తా మీదుగా..

నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలకు అధికారులు ట్రాఫిక్ డైవర్ట్ చేశారు. బోర్గాం చౌరస్తా వద్ద అధికారులు వాహనాలు వెళ్లేందుకు రూట్‌కు సంబంధించిన వివరాలతో బారికేడ్లను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ నుంచి వచ్చే వాహనాలు మోపాల్, కంజర్, ముల్లంగి, డిచ్‌పల్లి మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లవచ్చు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కసాబ్‌గల్లిలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఇద్దరు టీచర్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈనెల 4న జరిగిన హిందీ, ఉర్దూ పరీక్షకు సంబంధించి అదే సబ్జెక్టుకు చెందిన ఉర్దూ టీచర్ ఫర్వేజ్ ఇన్విజిలేటర్‌గా పనిచేశాడు. హైదరాబాద్‌కు చెందిన అబ్జర్వర్ ఆకస్మికంగా తనిఖీ చేసి గుర్తించారు. దీంతో పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్, ఉర్దూ టీచర్ ఫర్వేజ్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఫర్వేజ్ విధులకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు లేకున్నా పరీక్ష కేంద్రానికి ఇన్విజిలేటర్‌గా వెళ్లాడు. దీంతో చీఫ్ సూపరింటెండెంట్‌ను కూడా బాధ్యత రహిత్యంగా వ్యవహరించారని పేర్కొంటూ సస్పెండ్ చేశారు.

కొత్త కనెక్షన్‌తో కరెంట్ షాక్..!

రైతన్నపై మరో 'పిడుగు'

- విద్యుత్ ఉపకరణాల ధరలు భారీగా పెంచిన విద్యుత్ సంస్థలు
- రాయితీ మాత్రం పెంచని ప్రభుత్వం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు





వ్యవసాయ క్షేత్రాలలో వినియోగించే విద్యుత్ సరఫరా ఉపకారణాల ధరలు పెరగడంతో కొత్తగా కనెక్షన్ తీసుకునే రైతులపై భారీగా ఆర్థిక భారం పడనుంది. ఉపకారణాల ధరలు ఏకంగా 20 శాతం పెరిగాయి. 18 శాతం జీఎస్టీ తోడవుతుంది. ప్రభుత్వం అందించే రాయితీ పోగా అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవలే అకాల వర్షాలు, వడగళ్ల వాన, ఈదురు గాలులకు పంటలు నష్టపోయిన రైతులను ఈ విషయం ఆందోళనకు గురిచేస్తోంది.

డిచ్‌పల్లి (నిజామాబాద్‌రూరల్): వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సామగ్రిపై ప్రభుత్వం అందించే రాయితీ రెండు రకాలుగా ఉంది. సాగు అవసరాలకు కొత్తగా విద్యుత్ కనెక్షన్ కావలసిన రైతు ముందుగా మీసేవ కేంద్రంలో రూ. 5,295 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు (ఎస్టిమేషన్) సిద్ధం చేస్తారు. కనెక్షన్ ఇచ్చేందుకు అందుబాటులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండి రైతు పొలం వరకు మూడు విద్యుత్ స్తంభాలు, తీగ లాగడం, బిగించడం వంటి పనులు మాత్రమే ఉంటే ప్రభుత్వం రూ.45 వేలు రాయితీ ఇస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ కూడా బిగించాల్సి వస్తే రూ.70 వేలు రాయితీ అందిస్తుంది. ప్రస్తుతం ఈ రాయితీ మాత్రం పెరగకపోగా అదనంగా స్తంభాలు, తీగ, సామగ్రి అవసరమైతే ఆ చార్జీలను రైతే భరించాల్సి ఉంటుంది. పెరిగిన విద్యుత్ ఉపకరణాల ధరలకు అనుగుణంగా రాయితీని పెంచకపోవడంతో రైతులకు ఖర్చులు పెరిగాయి.

సాధారణ వినియోగదారులపైనా..

గృహ, వాణిజ్య కనెక్షన్ల పైనా ఆర్థిక భారం పడనుంది. వీటికి ప్రభుత్వం ఎలాంటి రాయితీ ఇవ్వదు. కొత్త కాలనీలు, గ్రామానికి దూరంగా ఉండే గృహాలు, ఇతర వ్యాపార సంస్థలు విద్యుత్ కనెక్షన్ కావాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ అధికారులు అంచనా వేసి నివేదికలు ఇస్తారు. దాని ప్రకారమే విద్యుత్ లైన్ చార్జీలు చెల్లించాలి. ఇప్పటికే వినియోగదారులు తీసుకునే మీటర్ పై జీఎస్టీ పేరిట 18 శాతం అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. పెరిగిన ఉపకరణాల ధరలు వీటికి తోడయ్యాయి. కొత్త కాలనీలో ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు స్తంభాలు కావాలంటే మూడు నెలల క్రితం దాదాపుగా రూ.లక్షా 50 వేల వరకు ఖర్చయ్యేది. తాజాగా పెరిగిన ధరల ప్రకారం రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. దీంతో వినియోదారుల పైన అధిక భారం పడనుంది.

పెరిగిన ధరల వివరాలు(రూ.లలో)

విద్యుత్ ఉపకరణం	పాత ధర	కొత్త ధర
ట్రాన్స్‌ఫార్మర్ 25కేవీ	70,139	99,337
ట్రాన్స్‌ఫార్మర్ 63కేవీ	1,45,000	2,03,874
ట్రాన్స్‌ఫార్మర్ 100కేవీ	1,88,000	2,48,255
ఏబీ స్విచ్	8,151	13,654
ఎర్త్ పైప్	2,939	3,201
విద్యుత్ తీగ(మీటర్‌కు)	24	38

పేద రైతులం.. ఇబ్బంది పెట్టొద్దు



కొత్తగా కొనుగోలు చేసిన పంటభూమిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, తీగ ఏర్పాటుకు డీడీ చెల్లించాను. ధరలను ఇలాగే ఇష్టమున్నట్లు పెంచితే మాలాంటి పేద రైతులు ఎలా పంటలు సాగు చేయాలి. ఇప్పటికే అన్ని రకాల ధరలు పెరిగి పంటలు సాగు చేయాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగు కోసం అవసరమయ్యే విద్యుత్ పరికరాలు రైతులకు పూర్తిగా ఉచితంగా అందించాలి.


– లకావత్ ప్రేమ్, రైతు, మెగ్యానాయక్ తండా

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

వ్యవసాయ, గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే విద్యుత్ పరికరాలన్నింటిపై 20 శాతం ధరలు పెరిగాయి. రైతులకు అందించే సబ్సిడీలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ధరలు పెరిగాయి. డీడీలు కట్టిన రైతులందరికి పెరిగిన ధరలే వర్తిస్తాయి. ఇప్పటికే పెరిగిన ధరలపై కింది స్థాయి అధికారులు, సిబ్బంది అందరికీ ఆదేశాలు జారీ చేశాం.

– ఆర్ రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

నేడు శోభాయాత్ర



- కంఠేశ్వర్ నుంచి గోల్‌హనుమాన్ వరకు ర్యాలీ
- 1500 మంది పోలీసులతో బందోబస్తు
- 600 సీసీ కెమెరాలతో నిఘా
- ర్యాలీ జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: నగరంలో నేడు నిర్వ హించనున్న హనుమాన్ శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు చేశారు. కంఠేశ్వర్ నుంచి గోల్‌హనుమాన్ వరకు నిర్వహించనున్న యాత్రకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి ఈ యాత్ర ప్రారంభమై గోల్‌హనుమాన్ వరకు కొనసాగుతుంది. అక్కడ జరిగే భారీ బహిరంగ సభతో ముగుస్తుంది. శోభాయాత్రకు హనుమాన్ భక్తులు రానుండడంతో వివిధ ప్రాంతాల్లో భక్తులకు నీటి వసతి కల్పిస్తున్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది చర్యలు తీసుకోనున్నారు.

రూట్ మ్యాప్ ఇదే..

నగరంలోని హనుమాన్ శోభాయాత్ర కంఠేశ్వర్ నుంచి ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి మీసేవా, జెడ్పీ జంక్షన్, నేషనల్ జంక్షన్, హమాలీవాడి జంక్షన్, వైశ్యభవన్, శివాజీ చౌక్, దేవీ రోడ్డు, మమత పాయింట్, గాంధీచౌక్, నెహ్రూ పార్క్, లక్ష్మి మెడికల్, ఆర్య సమాజ్ నుంచి గోల్ హనుమాన్ వరకు యాత్ర ఉంటుంది. శోభాయాత్రలో హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ తెలిపారు. హనుమాన్ శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో గంట నుంచి ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. కంఠేశ్వర్ నుంచి వెళ్లే వాహనాలు జెడ్పీ జంక్షన్ నుంచి చంద్రశేఖర్ కాలనీ నుంచి కంఠేశ్వర్ గుడి వెనుక భాగం రోడ్డు నుంచి అవకాశం కల్పించామని తెలిపారు. జెడ్పీ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను ఎస్ఎఫ్ఐ, నుంచి లేదా ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి కంఠేశ్వర్ నుంచి వెళ్లాల్సి వస్తుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను గమనించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని నగర ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో..

శోభాయాత్రకు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ బుధవారం వివిధ ప్రాంతాలను పరిశీలించారు. యాత్ర కోసం నాలుగున్నర కిలోమీటర్ల పరిధిలో 600 సీసీ కెమెరాలను ఏర్పాట్లు చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలలతో పాటు 1500 మంది పోలీసుల సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర సాగే ప్రాంతాల్లో వీడియోగ్రఫీ, మూడు డ్రోన్ కెమెరాలతో పటిష్టమైన నిఘా ఉంచనున్నారు.

టెన్త్ పేపర్ల లీకేజీ వెనుక బీజేపీ హస్తం

- మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆరోపణ

మోర్తాడ్(బాల్కొండ): టెన్త్ పరీక్ష పత్రాల లీకేజీల వెనుక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ హస్తం ఉందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఏర్గట్లలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ, ఎస్సెస్సీ బోర్డులు పరీక్షల నిర్వహణలో సమర్థవంతంగానే వ్యవహరిస్తున్నాయన్నారు. విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటమాడుతుందని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి ఒక పనికిరాని నాయకుడని అతనికి బాల్కొండ నియోజక వర్గంలో అభివృద్ధి కనబడడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ రాజేశ్వర్, డాక్టర్ మధుశేఖర్, కోటపాటి నర్సింహనాయుడు, ఉపేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ప్రభుత్వాన్ని బద్నామ్ చేస్తున్నారు

వేల్పూర్: కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడమే బీజేపీ ప్రధాన ఉద్దేశమని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. వేల్పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎస్సెస్సీ పేపరు లీకేజీపై స్పందించారు. టెన్త్ పేపరు లీకేజీ సూత్రధారి బండి సంజయేనని ఆరోపించారు. ఆయన పాత్రపై పోలీసుల వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

కామారెడ్డి మెడికల్ కాలేజీకి లైన్ క్లియర్

- ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులకు అనుమతి
- అందుబాటులోకి 100 ఎంబీబీఎస్ సీట్లు..
- మెరుగవనున్న వైద్య సేవలు



కామారెడ్డి వైద్య కళాశాల భవనం

కామారెడ్డి టౌన్: జిల్లా వైద్య కళాశాల ప్రారంభం దిశగా మరో ముందడుగు పడింది. వంద ఎంబీబీఎస్ సీట్లతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాల నిర్వహణకు నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తొమ్మిది వైద్య కళాశాలలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. కామారెడ్డి జిల్లాకు సైతం మెడికల్ కళాశాల మంజూరైంది. ఇప్పటికే మూడుసార్లు ఎన్ఎంసీ బృందం పరిశీలించింది. ఇక్కడ కళాశాల ఏర్పాట్లు, సౌకర్యాలపై తనిఖీలు చేసింది. చివరికి కామారెడ్డి కళాశాలకు అనుమతులు ఇస్తూ ఎన్ఎంసీ, మెడికల్ అసెస్‌మెంట్ రేటింగ్ బోర్డు ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకేంద్రంలో వైద్య కళాశాలతోపాటు మాతాశిశు ఆస్పత్రి, ఇతర నూతన విభాగాలు అందుబాటులోకి రానుండడంతో ప్రజలకు వైద్య సేవలు మెరుగవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

330 పడకలు..

జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం శరవేగంగా పనులు జరుగుతున్నాయి. నూతన కళాశాల భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. వచ్చే విద్యాసంవత్సరంలో మెడికల్ కాలేజీని ప్రారంభించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా కళాశాల భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే 130 పడకలతో ఉన్న ఆస్పత్రిలో అదనంగా మరో 100 పడకల కోసం రెండో అంతస్తులో రేకుల షెడ్డు ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేసింది. ఈ పనులు సైతం పూర్తికావచ్చాయి. దేవునిపల్లి డిగ్రీ కళాశాల వెనకాల ఎంసీహెచ్ భవనంలో మరో 100 పడకలతో మాతాశిశు ఆస్పత్రితో పాటు ఇతర విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. పాత కలెక్టరేట్‌లో ఎంబీబీఎస్ విద్యార్థులకు తరగతులను నిర్వహించాలని నిర్ణయించారు. పరిపాలన విభాగం కూడా అక్కడే ఉండనుంది. కామారెడ్డి కళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేశారు. ఈ సంవత్సరం నీట్ పరీక్ష అనంతరం కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులకు ఇక్కడ సీట్లు కేటాయిస్తారు.

ప్రిన్సిపాల్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు..

జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేశాక.. కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పెరుగు వెంకటేశ్వర్లును ప్రభుత్వం నియమించింది. ఆయన మూడు నెలల క్రితమే విధుల్లో చేరారు. గత నెలలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా డాక్టర్ సర్జా అడప్ప, ఎస్.జ్యోతిలు చేరారు. కళాశాలకు ఎన్ఎంసీ అనుమతులు మంజూరు చేయడంతో త్వరలోనే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, స్పెషలిస్టులు, వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసే అవకాశాలున్నాయి.

అనుమతులు వచ్చాయి



కామారెడ్డి వైద్య కళాశాలకు ఎన్ఎంసీ నుంచి అనుమతి వచ్చింది. ఈ ఏడాది కళాశాల ప్రారంభం కానుంది. నీట్ పరీక్ష అనంతరం సీట్లను భర్తీ చేయనున్నారు. వైద్య కళాశాలకు ఎన్ఎంసీ అనుమతులు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కళాశాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు మెరుగుపడనున్నాయి.

–పెరుగు వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, కామారెడ్డి

కొత్త పార్కుకు బాబూ జగ్జీవన్‌రాం పేరు

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌అర్బన్/ఖలీల్‌వాడీ: నగరంలో నూతనంగా నిర్మించే పార్కుకు బాబూ జగ్జీవన్‌రాం పేరు పెడతామని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. బుధవారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివంగత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు నగరంలోని పాత అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి ఎన్నోరకాలుగా సేవలందించిన మహనీయుడు బాబూజగ్జీవన్ రాం అన్నారు. ఆయనను ప్రజలు అనునిత్యం స్మరించుకునేలా స్థానికంగా ఏర్పాటు చేస్తున్న నూతన పార్కుకు బాబూ జగ్జీవన్ రాం పేరు పెట్టాలని నిర్ణయించామని ప్రకటించారు. దళితుల కోసం సంఘ భవన నిర్మాణాల కోసం నియోజకవర్గ ఫండ్ నుంచి రూ. 50లక్షల చొప్పున నిధులు కేటాయిస్తానని పేర్కొన్నారు. అనంతరం జెడ్పీచైర్మన్ విఠల్‌రావు, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌లు మాట్లాడుతూ కులాలను పక్కనపెట్టి, జగ్జీవన్‌రాం ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రాం ఆశయాలను ప్రజల్లోకి, యువతరంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భవిష్యత్తు కోసం, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జగ్జీవన్ రాం అందించిన సేవలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా కులాంతర వివాహాలు చేసుకున్న 15 జంటలకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే, రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటిన వర్ని బాలికల వసతి గృహం పదో తరగతి విద్యార్థిని సునీతకు జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి శశికళ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



నిరసనల సెగ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ బండి సంజయ్ అరెస్టు అక్రమమన్నారు. నగరంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

నగరంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం



ఇందల్వాయి: కేంద్ర ప్రభుత్వం తరపున డబ్ల్యూహెచ్ఓ వైద్య బృందం ఇందల్వాయి ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించింది. గతంలో ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ఫైలేరియా(బోదకాలు) సర్వే వివరాలను బృంద సభ్యులు తెలుసుకున్నారు. జోనల్ కోఆర్డినేటర్స్ డా.నిషిత్‌రాజ్, డా.సంబిత్ ప్రదాన్, ఆరోగ్య సిబ్బంది రాజేందర్, హెచ్ఈవో శంకర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ వాయిదా

నిజామాబాద్ సిటీ: ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏ(ఎఫ్) ఉద్యోగాలకు గురువారం నిర్వహించాల్సిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ వాయిదా వేసినట్లు డీఎంహెచ్ఓ సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలుపుతామని, అభ్యర్థులు గమనించాలని సూచించారు.

ఇసుక లారీల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గుండెనెమ్లి మంజీర క్వారీలో అనుమతులు ఒక చోట ఉంటే మరో చోట తవ్వకాలు చేపట్టి క్వారీ నిర్వాహకులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. వే బిల్లులు లేకుండా ఇసుకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు మేరకు పోలీసులు తనిఖీ చేసి బుధవార రెండు లారీలను పట్టుకున్నారు. అనుమతి పొందినచోట ఇసుక లేకపోవడంతో కిలోమీటరు దూరంలో ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వి వేబిల్లులు లేకుండా తరలిస్తున్నారని గ్రామస్తులు లారీలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై క్వారీ చేరుకొని వేబిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రావు అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని తహసీల్ కార్యాలయం వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి స్పీకర్ భూమి పూజ చేశారు. అనంతరం స్థానిక మీనా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నతనంలోనే అస్పృశ్యత, అంటరానితనంలకు ధైర్యంగా ఎదురించిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అని, దేశ స్థాయిలో అత్యున్నత పదవులను అలంకరించారని, 50 ఏళ్లు రాజకీయ జీవితంలో ఉన్నారని అన్నారు. బాన్సువాడలో బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. దళిత బంధును సద్వినియోగం చేసుకోవాలని, ఏ పథకమైనా అందరికి ఒకేసారి అమలు చేయడం ప్రభుత్వానికి కుదరదని అంచెలంచెలుగా అందరికి పథకం అందుతుందన్నారు. దేశంలో 29 రాష్ట్రాలుంటే మన రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎక్కడా అమలు కావడం లేదని అన్నారు. జగ్జీవన్‌రామ్ యువజన కమిటీ గౌరవ అధ్యక్షుడు పోశీరాం, అధ్యక్షులు గంగారాం, మున్సిపల్ చైర్మన్ జంగ గంగాధర్, నాయకులు కృష్ణరెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, గోపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, మారుతి, గంగాధర్, హన్మండ్లు, అశోక్, ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

యువత బీజేపీ ఉచ్చులో పడొద్దు

- ప్రశ్నాపత్రాల లీకేజీ బీజేపీ కుట్రే..
- ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి/నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చి, అభాసుపాలు చేసేందుకు బీజేపీ ఒక ప్రణాళిక ప్రకారమే ప్రశ్నాపత్రాల లీకేజీ కుట్రలకు పాల్పడుతోందని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆరునెలలు చదువు మానేసి బీజేపీకి పనిచేయాలని గతంలో ఇచ్చిన పిలుపులో భాగంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇలాంటి కుట్రలకు తెరలేపారని బాజిరెడ్డి ఆరోపించారు. ఎన్నికల ముందు విద్యార్థులు, యువత బాగా చదువుకుని ఉద్యోగాలు సాధిస్తే బీజేపీకి కార్యకర్తలు లేకుండా పోతారని పార్టీకి నష్టమని భావించి టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీకేజీ చేయించారని విమర్శించారు. ఇప్పుడు ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడ్డారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీకి పాల్పడిన నిందితుడు రాజశేఖర్‌రెడ్డి, ఇప్పుడు పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీకి పాల్పడిన నిందితులు హార్డ్‌కోర్ బీజేపీ కార్యకర్తలేనని ఆరోపించారు. లీకేజీ నిందితులు బండిసంజయ్‌తో పాటు బీజేపీ ముఖ్యనాయకులతో కలిసి ఉన్న ఫొటోలను ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, శ్రీనివాస్‌గౌడ్, ముత్యంరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, ప్రేమ్‌నాయక్, కొర్వ దేవేందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

వర్ని: నిరుపేద ప్రజల్లో అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటయ్య క్యాంపు గ్రామంలో 120 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. సేకరించిన స్థలంలో జి ప్లస్ 2 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, రోడ్లు, మురికి కాలువలు అన్నింటినీ ఏర్పాటుచేసి నిరుపేదలకు ఇండ్లు నిర్మించి పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేద ఉండకుండా ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు తావివ్వకుండా అసలైన అర్హులకు మాత్రమే పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అంతకుముందు గ్రామంలోని సాయిబాబా ఆలయంలో స్పీకర్ పూజలు చేశారు. సత్యనారాయణపురంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్పీకర్ భూమి పూజ చేశారు. వర్ని జెడ్పీటీసీ హరిదాసు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు వెలగపూడి గోపాల్, మండల ఉపాధ్యక్షులు బాలరాజు, కోఆప్షన్ సభ్యులు కరీం, ఉప సర్పంచ్ కంది కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రోజులు దగ్గర పడ్డాయి



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మద్నూర్: బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. మద్నూర్‌లోని ప్రధాన రహదారిపై బుధవారం బండి సంజయ్ అరెస్ట్‌కు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండ బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడం సీఎం కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శమన్నారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి బద్దం మైపాల్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి కన్వీనర్ రవికుమార్ గౌడ్, హన్మండ్లు, అజయ్, కృష్ణ, తుకారం, యాదవ్‌రావ్ పాల్గొన్నారు.

'పేపర్ లీకేజీ బండి సంజయ్ అనుచరుల పనే'



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఇటీవల జరుగుతున్న పేపర్ లీకేజీలకు ముఖ్యకారకుడని, కులమతాల మధ్య చిచ్చు పెట్టడమే కాకుండా.. నిరుద్యోగ యువత, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆరోపించారు. బుధవారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీకి బండి సంజయ్ అనుచరుడు ప్రశాంత్ కారణమన్నారు. తప్పు చేసినందుకే జైలులో పెట్టారన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామిక చర్యని, మోదీ–షా అవలంబిస్తున్న తీరు అప్రజాస్వామికమన్నారు. పచ్చని రాష్ట్రంలో బీజేపీ చిచ్చు పెట్టాలని చూస్తుందన్నారు. సెక్రెటేరియట్ కూల్చుతామని, బాంబులు పెడతామని బీజేపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటాన్నారు. బండి సంజయ్ మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు పాల్గొన్నారు.

జలాశయాల్లో తగ్గుతున్న నీటిమట్టం



నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం

నిజాంసాగర్: యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంట పొలాలకు విడతల వారీగా సాగు నీరందించడంతో నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు కౌలాస్ ప్రాజెక్టు నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయి. ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వలు రోజు, రోజుకు తగ్గుముఖం పట్టడంతో బండరాళ్లు తేలుతున్నాయి. వర్షాకాలం ముగింపు, వానాకాలం పంటల సూర్పిడి సమయానికి ప్రాజెక్టులో 1405 అడుగులు 17.8 టీఎంసీల పూర్తి స్థాయి నీరు నిల్వ ఉంది. పూర్తి స్థాయి నీటినిల్వలు ఉండటంతో యాసంగి పంటల సాగునీటికి భరోసానిచ్చింది. యాసంగి సీజన్‌లో నిజాంసాగర్ ఆయకట్టు కింద 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అలీసాగర్ రిజర్వాయర్ వరకు సాగు చేసిన పంటలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. ఇప్పటి వరకు ఆరు విడతల్లో 11.5 టీఎంసీల నీటిని పంటలకు అందించారు. మరో విడత సాగర్ నీటిని ప్రాధాన కాలువకు విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1395 అడుగులు 6.5 టీఎంసీల నీరు మాత్రం నిల్వ ఉంది.

కౌలాస్‌లో..

కౌలాస్ ప్రాజెక్టు 458 మీటర్లు 1.237 టీఎంసీలకు ప్రస్తుతం 455.3 మీటర్లు 0.65 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కౌలాస్ ప్రాజెక్టు ఆయకట్టు కింద 9 వేల ఎకరాల్లో రైతులు యాసంగి పంటలను సాగు చేశారు. ఆయకట్టు కింద సాగు చేసిన ఆరుతడి పంటలతో పాటు వరి పంటలకు ప్రాజెక్టు నుంచి ఆరు విడతల్లో పంట కాలువల ద్వారా సాగు నీరు అందించారు. ఎడమ కాల్వకింద 8,700 ఎకరాల్లో జుక్కల్, బిచ్కుంద మండలాల్లో పంటలు సాగు చేశారు. కుడి కాల్వ కింద పెద్దకొడప్‌గల్ మండలంలోని 300 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఆయా కాల్వల కింద సాగు చేస్తున్న పంటలకు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో ఆయ కట్టు పంటలు గట్టెక్కుతున్నాయి. కాగా ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గడంతో బోసిపోయి కన్పిస్తోంది. ఆయకట్టు పంటలకు మరో విడల నీటిని విడుదల చేయాల్సి ఉంది.







క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదా ల్లో ముగ్గురు మృతి చెందారు. నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు, గు ర్తు తెలియని వాహనం ఢీకొని మరొకరు, చెట్టును బైక్ ఢీకొని యువకుడు మృత్యువాత పడ్డారు.

నందిపేట్: మండలంలోని కౌల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు ఫారం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవిపట్నం గ్రామానికి చెందిన కుంచెపు నవీన్ మంగళవారం పని నిమిత్తం నిజామాబాద్ వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై తిరిగి వస్తుండగా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న పఠాన్ కాసీం అనే వ్యక్తిని ఢీకొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో పఠాన్ కాసీంతో పాటు కుంచెపు నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నవీన్ మృతి చెందాడు. పఠాన్ కాసీంకు కాలు విరిగింది. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



లాల్‌సింగ్ మృతదేహం

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటగిరి–ఎక్లాస్‌పూర్ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... కోటగిరి మండలం కొత్తపల్లి తండా నుంచి గుగ్లోత్ లాల్‌సింగ్(20), రాందాస్ (24) బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. లాల్ సింగ్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. రాందాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

చెట్టును ఢీకొని..



బాలకిషన్(ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గన్నారం గ్రామానికి చెందిన బొంకు బాలకిషన్(25) మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వివరాలు.. బాలకిషన్ గల్ఫ్‌లో ఉంటూ ఇటీవలే సెలవుపై స్వగ్రామం వచ్చాడు. సొంత పనులపై ఇందల్వాయి మండల కేంద్రానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా టోల్‌ప్లాజా వద్ద చెట్టుకు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. గాయపడ్డ బాలకిషన్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి నాలుగేళ్ల పాప ఉండగా భార్య ఇప్పుడు గర్భవతి అని గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలోని మసాయిపేట, మనోహరాబాద్ రైల్వేస్టేషన్ల మధ్యనున్న మెచూరసీ ఫ్యాక్టరీకి సమీపంలో పట్టాల పక్కన ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ బుధవారం తెలిపారు. మృతురాలి వయస్సు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఆత్మహత్యగానీ, ప్రమాదవశాత్తు పడిపోయిగానీ చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఒంటిపై ఎర్రటి, ఆకుపచ్చ, గులాబీ రంగుల చీర, ఎర్రటి జాకెట్, దారంతో కూడిన రోల్డ్ గోల్డ్ పుస్తెలు ఉన్నాయని తెలిపారు. ఆనవాళ్లను బట్టి ఎవరైనా ఆమెను గుర్తిస్తే కామారెడ్డి రైల్వే పోలీసులను (9440700034, 9703217723) సంప్రదించాలని కోరారు.

లారీ, బైక్ ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

పిట్లం: మండల కేంద్రంలో పిట్లం – నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామాల మధ్యలో జాతీయ రహదారిపై బుధవారం బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. నాగిరెడ్డిపేట మండలం జాన్కంపల్లి తండాకు చెందిన గోపి తన భార్యతో కలిసి బైక్‌పై పిట్లం నుంచి తండా వెళ్తుండగా లారీ ఢీకొంది. ప్రమాదంలో గోపి, అతని భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108 సిబ్బంది అంబులెన్స్‌లో బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.

వీసాల పేరిట మోసం చేసిన మహిళ అరెస్ట్

కామారెడ్డి క్రైం: మలేషియాలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ జిల్లాలోని రాజంపేటకు చెందిన పలువురి దగ్గర డబ్బులు వసూలు చేసి మోసగించిన హైదరాబాద్‌లోని ఫిర్జాదిగూడకు చెందిన అల్లిమినటి శ్వేతారెడ్డిని పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితురాలికి కామారెడ్డి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు కామారెడ్డి డీఎస్పీ సురేష్ తెలిపారు. వీసాల పేరిట డబ్బులు వసూలు చేసి మోసగించారని సిలివెరి శ్రీశైలం అనే వ్యక్తి జనవరిలో రాజంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత మరో ఐదుగురు వ్యక్తులు అదే తరహాలో శ్వేతారెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన 11 మంది బాధితులు వీసాల పేరిట మోసగించిన మహిళపై చర్యలు తీసుకోవాలనీ, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం రాజంపేట పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఒక్కొక్కరూ రూ.70 వేల చొప్పున శ్వేతారెడ్డికి ఇచ్చామనీ, మలేషియా పంపుతామని మోసం చేసినట్లు వారు తెలిపారు. తమకు న్యాయం జరిపించాలని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో స్పందించిన డీఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం శ్వేతారెడ్డిని అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా కోర్టు ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించింది. అంతేగాకుండా మంగళవారం తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళనకు దిగిన విషయంలో సైతం పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రాజంపేట ఠాణాలో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించారంటూ బాధితులకు మద్దతుగా వచ్చిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

చిత్తుబొత్తు ఆడిన ఆరుగురిపై కేసు

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో చిత్తు బొత్తు ఆడిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ బుధవారం తెలిపారు. గ్రామంలోని చెరువు సమీపంలో చిత్తు బొత్తు ఆడుతున్న ఆరుగురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని వారి నుంచి రూ.1800 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అన్నం లేక అనారోగ్యంతో మృత్యువాత

ఖలీల్‌వాడి:నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరిత హోటల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(55) అన్నం లేక అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. బుధవారం హరితహోటల్ ఎదుట రోడ్డుపై చనిపోయి ఉన్నారని చెప్పారు.

అభివృద్ధిలో బీజేపీ పాత్ర సున్నా



జాన్కంపేట్‌లో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: అభివృద్ధిలో బీజేపీ పాత్ర సున్నా అని, నిధులు కేంద్రమే ఇస్తుందని పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని జాన్కంపేట్, సాహెబ్‌పేట్, వేల్పూర్, వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్ గ్రామాల్లో బుధవారం మంత్రి రూ. 36 కోట్లతో రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్ల నిధుల మంజూరుకు తాను చేసిన కృషి తాలూకు ఆధారాలను బ్యానర్ ఏర్పాటు చేసి వివరించారు. బీజేపీ నాయకులు మేమే చేయించామని అబద్ధాలు చెబుతున్నారని, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంలో ఆధారాలు బ్యానర్ రూపంలో అందరికీ అర్థమయ్యేలా ఏర్పాటు చేశామని తెలిపారు. సీఆర్ఐఎఫ్ కింద ఎంపీ అర్వింద్ నిజామాబాద్ జిల్లాలో ఒక్క గ్రామానికి కూడా రోడ్డు అడగలేదన్నారు. తాను, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడి గోవర్ధన్ కలిసి రూరల్, బాల్కొండ నియోజక వర్గాల కోసం 14.1 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 21 కోట్లు, బాల్కొండ నియోజవర్గంలో 9 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ. 15 కోట్లు ప్రతిపాదన పెట్టామని ఆధారాలతో వివరించారు. అర్వింద్ కోరుట్ల నియోజకవర్గంలో ఒక రోడ్డుకు మాత్రమే ప్రతిపాదన పెట్టాడని తెలిపారు. డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శంకర్ మృతదేహం

నాగిరెడ్డిపేట: కూతురి పెళ్లి చేయడంతోపాటు పొలంలో వేసిన బోరు ఫెయిల్ కావడంతో అప్పులు ఎక్కువై జీవితంపై విరక్తి చెందిన ఓ గిరిజన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం మండలంలోని ఎర్రకుంటతండాలో చోటుచేసుకుంది. వివరాలు.. తండాకు చెందిన రమావత్ శంకర్(48) బుధవారం ఇంటిముందు పడుకొని ఉండగా అతని భార్య అంజి గమనించి అతని వద్దకు వచ్చి లేపే ప్రయత్నం చేయగా అతను లేవలేదు. అతని పక్కన పురుగుల మందు డబ్బా పడి ఉండడాన్ని గమనించిన ఆమె ఆందోళనకు గురై స్థానికుల సహాయంతో శంకర్‌ను అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. కాగా శంకర్ గతయేడు కూతురి పెళ్లి చేయడంతోపాటు నెలరోజుల క్రితం వ్యవసాయ భూమిలో బోరు వేయగా అది ఫెయిల్ అయినట్లు తండావాసులు తెలిపారు. దీంతో అప్పులు ఎక్కువ కావడంతో తీవ్రమనోవేదనకు గురై తన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని భార్య అంజి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



రామస్వామి(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన కొంగరి రామస్వామి(25) గ్రామశివారులోని నాగనయ్య చెరువులో మునిగి మృతిచెందాడు. రామస్వామి రెండు రోజుల క్రితం పని ఉందని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. చీకటిపడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని కోసం కుటుంబసభ్యులు పటుచోట్ల గాలించారు. అయినా రామస్వామి ఆచూకీ లభ్యంకాలేదు. కాగా బుధవారం గ్రామశివారులోని నాగనయ్య చెరువులో రామస్వామి మృతదేహం తేలడంతో గ్రామస్తులు విషయాన్ని అతని కుటుంబసభ్యులకు తెలియజేశారు. రామస్వామి గత కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడని, రెండురోజుల క్రితం కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువులోకి వెళ్లిన సమయంలో ఫీట్స్ రావడంతో నీటిలో మునిగి మృతిచెందాడని తండ్రి శంకరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చెరువు వద్దే రామస్వామి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు.

కాలువలో పడి ఒకరు..



యాసిన్ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నుస్రత్‌నగర్ ఏరియాలో గల నిజాంసాగర్ కాలువలో పడి నుస్రత్‌నగర్‌కి చెందిన మహ్మద్ యాసిన్(18) మృతి చెందినట్లు ఎస్సై సాయినాథ్ తెలిపారు. కాలువలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడి చనిపోయాడన్నారు. మృతుడి తండ్రి మొహమ్మద్ అయుబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గుండెనెమ్లిలో మహారాష్ట్ర దేశీదారు అమ్ముతున్న గూల సాయిలును పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు హోటల్, ఇంట్లో దాడి చేసి 48 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి



డిచ్‌పల్లి: దివ్యాంగుల హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీరప్ప, నర్మల శామ్యూల్ తెలిపారు. మండలం ధర్మారం(బి) గ్రామంలో బుధవారం డిచ్‌పల్లి మండల దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ ఏర్పాటు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, వికలాంగులు ఏవిధంగా తమ హక్కులు సాధించుకోవాలనే అంశాలను వారు వివరించారు. అనంతరం మండల నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాథోడ్ తిరుమల్‌నాయక్, ఉపాధ్యక్షులుగా దోర్నాల సురేష్, మండల కార్యదర్శిగా మారేని ప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా వెనుకపల్లి మేఘన ఎన్నికయ్యారు.

దేశ తలసరి ఆదాయం పడిపోతుంది



ఖలీల్‌వాడి: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రాయితీలను కల్పిస్తూ, నిత్యవసర సరుకుల ధరలను పెంచడంతో దేశ తలసరి ఆదాయం పడిపోతుందని వామపక్ష నాయకులు ఆరోపించారు. బీజేపీ అనుసరించే కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం నగరంలో వారు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజా సంపదను ఆదాని, అంబానీ లాంటి కొద్దిమంది కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. నాయకులు పెద్ది వెంకట్‌రాములు, గోవర్దన్, గంగాధర్, లత, గీతాంజలి, కవిత తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



నిజామాబాద్‌అర్బన్: టీఎస్పీఎస్సీ, ఎస్సెస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీలను, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అరెస్టును నిరసిస్తూ నగరంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు బుధవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాలు లీకేజీలను నిరసిస్తూ ఎస్సెస్సీ బోర్డును ముట్టడించడానికి వెళ్లిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. వెంకట్‌ను వెంటానే విడుదల చేయాలని లేనిపక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు నిఖిల్‌రెడ్డి, అష్రఫ్, సందీప్ రెడ్డి, వెంకట్, శివ, లక్ష్మీకాంత్, సాయి, బన్నీ సింగ్, చిన్న, రాహుల్, శ్రీకాంత్, రాఘు ,చిన్న, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



డిచ్‌పల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, వారిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కార్మికులకు కనీస వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏప్రిల్ 11నుంచి 20వరకు జిల్లా జేఏసీలను ఏర్పాటు చేసి ఆందోళన కార్యక్రమాలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. 10న పంచాయతీ రాజ్ కమిషన్ వద్ద జరిగే ధర్నాలో అన్ని జిల్లాల పంచాయతీ కార్మికులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజామొయినుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీగంగాధర్, ఉపాధ్యక్షులు సుంకర శ్రీనివాస్, చొప్పరి గంగాధర్, మోహన్, నవీన్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి




నగరంలో నివాళులు అర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, తదితరులు.. సీపీ కార్యాలయంలో..



బెటాలియన్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో కమాండెంట్ సత్యశ్రీనివాసరావు, సిబ్బంది



ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో..

నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో బుధవారం భారత తొలి దళిత ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని వివిధ శాఖల అధికారులు, సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా సంఘాలు, పార్టీల నేతలు, అధికారులు జగ్జీవన్ రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..బడుగు వర్గాల కోసం, సమ సమాజ స్థాపన కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అణగారిన వర్గాల ఆశాజీవిగా ఆయన చరిత్రలో స్థానం సంపాదించుకున్నారని గుర్తు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



జీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో..



నగరంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..



ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..



నిజామాబాద్ రూరల్ మండలంలో..



గడ్కోల్ గ్రామంలో..

బండి సంజయ్ అరెస్టు అక్రమం



మోపాల్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు..



డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో..



ధర్పల్లి మండల కేంద్రంలో..

డిచ్‌పల్లి/ధర్పల్లి/జక్రాన్‌పల్లి/ఖలీల్‌వాడి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ అక్రమమని పార్టీ శ్రేణులు ఆరోపించారు. ఈమేరకు బీజేపీ నాయకులు బుధవారం సంజయ్ అరెస్టుకు నిరసనగా నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసనలు తెలిపారు. పలుచోట్ల రాస్తారోకోలు చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. అర్ధరాత్రి ఒక పార్లమెంట్ సభ్యుడిని ఎలాంటి వారెంట్ లేకుండా ఎలా అరెస్ట్ చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, ప్యాకేజీల విషయంలో బండి సంజయ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుండటంతో భయంతో అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. కొన్ని రోజులుగా ప్రశ్నించే వారిని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని, సరైన పాలన చేతకాక టీఎస్పీఎస్సీ, పదో తరగతి పేపర్ల లీకేజీలకు కారణమవుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్నారని అన్నారు. కేసీఆర్ పాలన నిజాం పాలనను గుర్తు చేస్తుందని గుర్తు చేశారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు...

నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లోని పలుచోట్ల బీజేపీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ నేతలు ఆందోళనకు దిగుతారేమోనని పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. అలాగే పలుచోట్ల శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే మన బలం



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: అభివృద్ధి సంక్షేమ పథకాలే మన బలం– బలగమని శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండప్రకాష్, ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా తెలిపారు. నగరంలోని జనార్ధన్ గార్డెన్స్‌లో బుధవారం 8, 9, 27, 28, 50వ డివిజన్ల బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. నగర అభివృద్ధిలో భాగంగా నూతన కలెక్టరేట్, అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ, ఐటీ హబ్, అర్బన్ పార్క్, సెంటర్ మిడియన్ లైట్లు, అందమైన చెట్లని ఏర్పాటు చేసామన్నారు. ప్రతి గల్లీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. మీ అందరి సహకారంతో మూడోసారి అధికారంలోకి రావడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం కార్యకర్తలకి స్వయంగా ఎమ్మెల్యే భోజనం వడ్డించి భోజనం చేశారు. 27వ డివిజన్ బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. మేయర్ నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా రాములోరి రథోత్సవం

ఇందల్వాయి: ఇందల్వాయి రామాలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సీతారాముల విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ పూజారి కాందల్లై గోపాలచారి, సర్పంచ్ పాశం సత్తెమ్మ, ఎంపీటీసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,000	వెండి (కిలో)	72,250
22 క్యారెట్స్	55,315		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	క్యాప్సికం	40	60
బెండకాయ	40	60	గాజరుగడ్డ	15	30
బీరకాయ	40	60	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	25	50	దోసకాయ	10	20
బీర్నిసుకాయ	60	80	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	40	60	గోబిపువ్వు	20	40
పాలకూర	35	50	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	50	70
పుదీనా	20	40			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్–1– దసరా –(తెలుగు), 10.20, 1.30, 4.10,7.30, 10.30
స్క్రీన్–2– దేశముదురు (తెలుగు)2డీ–10.00
భోళా–(హిందీ) 3డీ –1.35
దాస్ కా దమ్కీ– 4.30
స్క్రీన్–3– దేశముదురు–(తెలుగు)–2డీ– 12.40,4.00,7.15,10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– భోలా (హిందీ–3డీ) – 12.30, 3.40, 7.30, 10.40
స్క్రీన్–2 – జాన్‌విక్ చాప్టర్–4 (ఇంగ్లీష్) – 12.20
దసరా –(తెలుగు) 3.50, 7.15, 10.30
స్క్రీన్–3– దాస్ కా దమ్కీ –12.00
జాన్‌విక్ చాప్టర్–4 (ఇంగ్లీష్) – 3.10, 6.40, 10.10
స్క్రీన్–4– డంజియన్స్ అండ్ డ్రాగన్స్ (ఇంగ్లీష్) 1.15, 10.20
పరారీ – 4.10 దాస్ కా దమ్కీ – 7.10

దేవి	దాస్ కా దమ్కీ
నటరాజ్	భోలా (హిందీ–3డీ)
లలితామహల్	దసరా
విజయ్	బలగం

ప్రారంభమైన విశ్వశాంతి మహాయాగం



మహాయాగంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే



రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్,

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్‌లో విశ్వశాంతి మహాయాగ మహోత్సవము బుధవారం వేదమంత్రాలు, గణపతి ప్రత్యేక పూజలతో ప్రారంభమైంది. కృష్ణజ్యోతి స్వరూపనంద స్వామీజీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలతో యాగాన్ని ప్రారంభించారు. తొలిరోజు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల, మేయర్ దండు నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి యాగంలో పాల్గొన్నారు.

12రకాల నిత్యావసర సరుకులు అందించాలి



డిచ్‌పల్లి(మోపాల్): రేషన్ దుకాణాల్లో ప్రజలకు అవసరమైన 12 రకాల నిత్యావసర సరుకులు, ప్రతి మనిషికి 10 కేజీల బియ్యం, సబ్సిడీపై వంట గ్యాస్‌ను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పీవోడబ్ల్యూ సభ్యులు డిమాండ్ చేశారు. మోపాల్ మండలంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం డిమాండ్లతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి సంధ్య మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులైన వంట నూనె, పప్పులు, పసుపు, పంచదార, కారం, ఉప్పు, చింతపండు, టీపొడి, సబ్బులు మొదలైన సరుకులను పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా అందించాలని కోరారు. లేదంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సభ్యులు పాల్గొన్నారు.

సిరికొండ: రేషన్ దుకాణాల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా సరఫరా చేయాలని పీవోడబ్ల్యూ సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఈ విషయంపై రూపొందించిన వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు.

సంక్షిప్తం

శాసనమండలి వైస్ చైర్మన్‌ను కలిసిన ముదిరాజ్‌లు

సిరికొండ: జిల్లా కేంద్రానికి వచ్చిన శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్‌ను బుధవారం మండలానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు కలిశారు. జిల్లా ముదిరాజ్ సంఘం ప్రచార కార్యదర్శి కుందేళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నారవోయిన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

సిరికొండ: మండలంలోని మైలారం గ్రామంలో బుధవారం యశోధ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సర్పంచ్ గాండ్ల రమ్య ప్రారంభించారు. ఉపసర్పంచ్ సత్యానంద్, ఫౌండేషన్ ఫీల్డ్ ఆఫీసర్ మంజుల, డీఎస్‌టీ ఇన్‌చార్జి సంధ్యారాణి పాల్గొన్నారు.

జెడ్పీటీసీ జగన్‌కు సన్మానం



నిజామాబాద్ సిటీ: మున్నూర్‌కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనా బాజిరెడ్డి జగన్‌ను బుధవారం మహాలక్ష్మీ మహిళ మండలి అధ్యక్షురాలు ముత్యాలా శిల్పా ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మండలి సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్(ఎం) గ్రామ మాజీ సర్పంచ్ దాదురావు తమ్ముడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జి భూపతిరెడ్డి పరామర్శించారు.

పలు కుటుంబాలను పరామర్శించిన అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్‌నాగారం: నగరంలోని బీఆర్ఎస్ నాయకులు మచ్చల్ శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా పరామర్శించారు. అలాగే కపిల హోటల్ ఎండీ రామ కృష్ణరెడ్డి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మంత్రి, ఎమ్మెల్సీ వ్యాఖ్యలు సరికావు

నిజామాబాద్‌అర్బన్: వికారాబాద్ జిల్లాలో పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంలో నిందితుడైన బందెప్ప తెంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకుడని మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ పేర్కొనడం సరికాదని జిల్లా తపస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పరశి కృష్ణవేణి, భట్టు బద్రినాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బందెప్ప గవర్నమెంట్ టీచర్ అసోసియేషన్ నాయకుడని తెలిపారు.

ఐకేపీ వీవోఏల సంఘం..



సిరికొండ: మండల ఐకేపీ వీవోఏల సంఘం నూతన కార్యవర్గంను బుధవారం సిరికొండలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మూన్‌సింగ్ (ముషీర్‌నగర్), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సున్నపు స్వామి (గడ్కోల్), ఉపాధ్యక్షులుగా లలిత, కార్యదర్శిగా వినోద్, కోశాధికారిగా కవిత, సహాయ కార్యదర్శిగా స్వరూప ఎన్నికయ్యారు.

రాజకీయ లబ్ధి కోసమే ప్రశ్నాపత్రాల లీకేజీ



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ నేతలు టీఎస్‌పీఎస్సీ, పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడుతుందని డీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్ ఆరోపించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. మోహన్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని, ఇలాంటి నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

బండి సంజయ్‌ను కఠినంగా శిక్షించాలి..

నిజామాబాద్‌నాగారం: పదో తరగతి పేపర్ లీకు నాటకం ఆడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను కఠినంగా శిక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రుల ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు నగరంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఫోరం ప్రతినిధి నరాల సుధాకర్ మాట్లాడుతూ..పేపర్ లీక్ కుట్రలో ఉన్నవారు ఎంత పెద్ద పదవిలో ఉన్నాగాని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.